
# కళాకారుల బతుకులతో ఆటలాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**సాంస్కృతిక సారథిలో 1,000 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి**

**సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర కమిటీ నాయకులతో చర్చలు జరపాలి**

**తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండ్ర కుమార్**





తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, సెప్టెంబర్ 14

తెలంగాణ ఉద్యమంలో ఆటపాటలతో ప్రజలను చైతన్యపరిచి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన కళాకారుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండ్ర కుమార్ ఆరోపించారు. కళాకారుల బతుకులతో ఆటలాడకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గోసి, గొంగడి ధరించి ఊరు ఊరు తిరుగుతూ పోరుపాటలు, ధూంధాం కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన కళాకారుల పాత్ర మరువలేనిదన్నారు. అయితే గత ప్రభుత్వం సాంస్కృతిక సారథిలో 550 మందికి ఉద్యోగాలు కల్పించినప్పటికీ, అసలైన అర్హులైన అనేక మంది కళాకారులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. సాంస్కృతిక సారథి ఉద్యోగాల విషయంలో న్యాయం కోసం కేసులు వేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కళాకారులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, వెయ్యి ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించడంతో పాటు ఆ అంశాన్ని మేనిఫెస్టోలోనూ పొందుపరిచిందని కొండ్ర కుమార్ గుర్తుచేశారు. అయితే ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇటీవల శాసనసభలో సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కళాకారులను ఆదుకుంటామని చెప్పడం తప్ప, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కళాకారుల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ నాయకులతో చర్చలు జరిపి, సాంస్కృతిక సారథిలో 1,000 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. “కాలయాపన వద్దు.. కళాకారుల ఉద్యోగాలు ముద్దు” అనే నినాదంతో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే 33 జిల్లాల కళాకారులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు, ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అవసరమైతే చలో రవీంద్రభారతి కార్యక్రమం చేపట్టి ముట్టడిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని ఊపిరిగా నమ్ముకుని, ప్రాణత్యాగాలకు సైతం సిద్ధపడి పోరాడిన కళాకారులను ప్రభుత్వం మోసం చేసే విధంగా వ్యవహరిస్తే, పాటనే ఆయుధంగా చేసుకుని ప్రభుత్వానికి ప్రజల్లో సమాధానం చెబుతామని కొండ్ర కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ, వివిధ జిల్లాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వేంసూరు మండలంలో ఘనంగా ఆరంభమైన గణేష్ నవరాత్రులు”

**పులకించి వర్షించిన వర్ణుడు”**









సత్తుపల్లి/వేంసూరు,సెప్టెంబర్14(తెలుగు గళం) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో వాడ వాడలా పెద్దలు,పిల్లలు ఆదివారం గణేష్ చతుర్థి పండుగను పురస్కరించుకొని వినాయకుని నవరాత్రుల వేడుకలకు గణేష్ విగ్రహాలను బియ్యపు పిండితో పద్మం ముగ్గులు వేసి నవధాన్యాలు పోసి,తెల్లని పంచెలు పరిచి మంటపాలలో ప్రతిష్ఠించారు.పూజారుల చేత అఖండ దీపాలు వెలిగించి వేద మంత్రోచ్ఛరణల నడుమ గణపతికి పత్రితో,బిల్వ,మారేడు దళాలతో విశిష్టపూజలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.వినాయకుని వ్రతకథను భక్తి శ్రద్ధలతో ఆలకించారు.ఉండ్రాళ్ళ,పాయసం,వడపప్పు,కుడుములు,గారెలు,బూరెలు,పులిహోర,అరటిపండ్లు తదితర పదార్థాలను విఘ్నాలు లేకుండా చూసే వినాయకునికి నివేదన చేసారు.వినాయకుని కరుణతో పులకించిన వరుణుడు మధ్యాహ్నం వర్షశీ రూపంలో వర్షించాడు.దీంతో రైతుల మోములో ఆనందం అగుపించింది.

## నేడు విశ్రాంత సింగరేణి ఉద్యోగుల పెన్షన్ అదాలత్”

సత్తుపల్లి,ఆర్ సి,సెప్టెంబర్14(తెలుగు గళం) న్యూస్: సీఎంపిఎఫ్ కమిషనర్ ఆధ్వర్యంలో ట్రైపార్టీట్ సీఎం పిఎఫ్ కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ మరియు పెన్షన్ అదాలత్ సత్తుపల్లి ఏరియాలోని జిఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నేడు అనగా మంగళవారం ఉదయం 10.30 గంటల నుండి 1.00 గంటల వరకు మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందనీ సింగరేణి అధికారిని కావ్య మీడియాకు వెల్లడించారు. రిటైర్ కార్మికులు ఈ పెన్షన్ అదాలత్ కార్యక్రమంలో పాల్గొని తమకున్నటువంటి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.

# బాధితుడు పాషాకు బీఆర్ఎస్ అండ.. రూ.7,500 ఆర్థిక సాయం అందజేత

**ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది -- కాకులమర్రి లక్ష్మణ్ బాబు**

**కాలు కోల్పోయిన పాషాకు పరామర్శ.. తక్షణ ఆర్థిక సాయంతో భరోసా**



తెలుగు గళం ఏటూరునాగారం, సెప్టెంబర్ 14:

ఏటూరునాగారానికి చెందిన మహమ్మద్ నన్ను పాషాకు ఇటీవల కాలు ఆపరేషన్‌లో భాగంగా కాలు తొలగించాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు వెంటనే స్పందించి, ఆయన ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.7,500 తక్షణ ఆర్థిక సాయాన్ని అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, వార్డు సభ్యులు గంప కిరణ్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏటూరునాగారంలో గుర్తు తెలియని మృతదేహం

**● బస్టాండ్ సమీపంలోని గ్రంథాలయం ఆవరణలో మృతదేహం లభ్యం -- పోలీసుల దర్యాప్తు**






తెలుగు గళం, ఏటూరునాగారం, సెప్టెంబర్ 14:

ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న గ్రంథాలయం ఆవరణలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించడం స్థానికంగా కలకలం రేపింది. గ్రంథాలయం పరిసరాల్లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఏటూరునాగారం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని ఏటూరునాగారం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు వివరాలు లభించాయా అనే విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి ఆచూకీ, పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. మృతుడి కుటుంబ సభ్యులు లేదా బంధువులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అలాగే మృతికి గల కారణాలపై కూడా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీసుల విచారణ పూర్తయిన తర్వాతే మృతికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# వినాయక చవితికి పర్యావరణ హితం చాటిన జ్వాలా ట్రస్ట్, మట్టి విగ్రహాల వినియోగంపై ప్రజలకు అవగాహన

**పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలి**

**ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు స్వస్తి పలకాలి -- జన విజ్ఞాన వేదిక**

**మట్టి గణపతితోనే పర్యావరణానికి మేలు**

**కమలాపురంలో 200 మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ**



తెలుగు గళం మంగపేట, సెప్టెంబర్ 14:

వినాయక చవితిని పురస్కరించుకొని జ్వాలా చారిటబుల్ ట్రస్ట్, జన విజ్ఞాన వేదిక ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో, జెడ్పిహెచ్ఎస్ కమలాపురం పాఠశాల సహకారంతో గ్రామంలో సుమారు 200 మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమవుతాయని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని పిలుపునిచ్చారు. జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి, జన విజ్ఞాన వేదిక ఆరోగ్య విభాగం కన్వీనర్ మునిగాల రాకేష్ మాట్లాడుతూ మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు తమ సంస్థలు చేస్తున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పల్లె నాగరాజు, లక్ష్మణ్ రావు, యలవర్తి శ్రీనివాస్, లింగంపల్లి శ్రీనివాస్, శ్రీధర్, జెడ్పిహెచ్ఎస్ విద్యార్థులు రాజేష్, రవళితో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ములుగు కేంద్రీయ విద్యాలయంలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ఉపాధ్యాయులు, ప్రత్యేక విద్యా బోధకులు, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు అవకాశం**




తెలుగు గళం ములుగు, సెప్టెంబర్ 14:

ములుగు జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయంలో వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సీతారాం తెలిపారు. బాలవాటిక--1, 2, 3, ప్రీ-ప్రైమరీ తరగతులతో పాటు ఉపాధ్యాయులు, ప్రత్యేక విద్యా బోధకులు, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు కేవీఎస్ సంవిద సాతి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 17న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సీతారాం వెల్లడించారు.

# వెంకటాపురంలో జై ఆదివాసీ యువశక్తి మహిళా కమిటీ పిడికిలి బిగింపు

**మిచ్చ అనిత అధ్యక్షురాలిగా ఏకగ్రీవ ఎన్నిక.. హక్కుల సాధనకు నిరంతర పోరాటం**

**చట్టాలు, జీవోలు అమలు చేయకపోతే మహిళలతో భారీ ఉద్యమాలు -- బడే సులోచన**

**ఆదివాసీల హక్కులను కాలరాస్తే ప్రభుత్వాన్ని నిలదీస్తాం:-- కోడిపే నయోమి**





తెలుగు గళం వెంకటాపురం(నూగూర్), సెప్టెంబర్ 14:

ములుగు జిల్లా వెంకటాపురం మండలం స్థానిక గెస్ట్‌హౌస్‌లో జై ఆదివాసీ యువశక్తి జిల్లా ప్రధాన కార్యదర్శి వాసం జమున అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు బడే సులోచన, జిల్లా అధ్యక్షురాలు కోడిపే నయోమి సమక్షంలో వెంకటాపురం మండల మహిళా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా మిచ్చ అనిత, ప్రధాన కార్యదర్శిగా ముర్రం శంకరమ్మ, ఉపాధ్యక్షురాలిగా తాటి సుభద్ర, కార్యదర్శిగా ఉమ్మడి జ్యోతి, కోశాధికారిగా పొడెం అమృత, సభ్యులుగా పూనెమ్ ఝాన్సీ, పూణే సుజాత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బడే సులోచన మాట్లాడుతూ ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలపై ఇక మహిళలు మౌనంగా ఉండేది లేదని, హక్కుల పరిరక్షణ కోసం గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కోడిపే నయోమి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు, జీవోలు సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాల కాలంలో అమలైన ఆదివాసీ ప్రయోజనాలకు సంబంధించిన జీవోలను ప్రస్తుత ప్రభుత్వం కూడా పకడ్బందీగా అమలు చేయాలని, ఆదివాసీల హక్కులను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని హెచ్చరించారు. నూతన అధ్యక్షురాలు మిచ్చ అనిత మాట్లాడుతూ మండలంలోని ఆదివాసీ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై కమిటీ సమిష్టిగా పోరాడుతుందని, ఆదివాసీ హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా నాయకులు చేలే శమంతకమణి, శిరీష, కుడుముల స్వప్నతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆదివాసీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

